


# అనుబంధాలు

వల్లంపాటి వెంకటసుబ్బయ్య

**అయ్యా!** నాపేరు శేషగిరి. మా ప్రాంతం నుంచి వచ్చే రైతులు నన్ను 'శేషప్ప' అంటారు. చదువుకున్న వాళ్ళు, చదువుకున్నామనుకున్న వాళ్ళు 'మిస్టర్ గిరి'అనటం కూడా కద్దు. అది వేరే సంగతి.

అసలు విషయం ఏమిటంటే, ఈ ప్రపంచం అంటే ఈ మనుషులన్నమాట పెదవులతో పలకరిస్తూ, నొసలుతో వెక్కిరిస్తూ రెండు కన్నది?

ఒక వేస్తగా ణ్ణడిగితే—

"ఒరే, నాయనా! నీతోనే కాదు, అందరితోనూ అలాగే ప్రవర్తిస్తారు" అన్నాడు.

"ఎందుకు?" అన్నాను.

వాడు వేదాంతిలా నవ్వి, నా అజ్ఞానాన్ని నాజూగ్గా వెక్కిరించి, తన అజ్ఞానాన్ని చిరునవ్వు కింద దాచేశాడు.

ప్రశ్న మాత్రం ప్రశ్నగానే శేషగిరి

పోయింది.

నేను మంచి వాణ్ణి కాదంటారు మా బంధువులు. నాకు మంచి చెడ్డల్ని గురించి శంకరా చార్యుడిలా చర్చించే శక్తి లేదు కానీ, ఒక మాట మాత్రం ఇప్పుడు నా ఎదుట సీసా ఉన్నంతనిజం. నేను చెడ్డ వాణ్ణి మాత్రంకాను. ఇప్పుడు నేనున్న స్థితిలో నాలాంటి వాడు అబద్ధం చెప్పడు.... అన్నట్టు. నేను తాగుబోతుననే వాళ్ళు కూడా ఉన్నారు.

నేను తాగే మాట నిజమే. కాని తాగుబోతును మాత్రం కానంటే కానంటే కాను. నా గుణం మంచిది కాదనే వాళ్ళూ ఉన్నారు.

"గుణం అంటే ఏమిటి?"ఆ మాట అన్నఒక బంధువుతోమనలో మనమాటగా చెప్తున్నాను. ఆయనగారి 'గుణం' నాకు బాగా తెలుసు అన్నాను.

వాడు ఇరుకు మూన్లో ఇరుక్కున్న దొంగ గొడ్డులా గింగిరులాడి పోయాడు.

"నువ్వు ఆమెతో అలా ఉండటం నీతికాదు." అన్నాడు చివరికి పైకప్పును చూస్తూ.

"ఎవరితో?"

"ఆదిలక్ష్మితో."

"ఎందుకూ?" అన్నాను.

"ఆమెది మన కులం కాదు."

"కులం ఎలా పుట్టిందో నీకుతెలుసా" అన్నాను.

"మీరిద్దరూ పెళ్ళి కూడా చేసుకోలేదు." గట్టిగా అరిచాడు.

"పెళ్ళంటే ఏమిటో నీకు తెలుసా?" అన్నాను.

"థూ! నీముఖం చూడకూడదు" అంటూ ఆమాన అనే బంధువు పారి పోయాడు. ఆనాటితో నాకు బంధువుల బంధాలు తెగిపోయాయి. నిజం చెప్పాలంటే నా బ్రతుకులో ఆనందం అనాడే ప్రారంభమైంది. అది ఆదిలక్ష్మి ప్రేమలా, నా అస్తిపంజరంలో పాలు జొన్న కర్రలా ఎదుగుతూ వచ్చింది.

ఈ విషయం తెలిసిన ఒకే ఒక నేస్తగాడు డాక్టర్ వేణు.

ఆఁ. వేణంటే జ్ఞాపక మొచ్చింది. మనిషంటే వాడే కత్తిలాంటి మనిషి. వాడికి నా మనసులోని ఆలోచనల్ని గురించి నాకంటే బాగా తెలుసు.

మాంచి మూడ్లో ఉన్నప్పుడు అంతటివిజ్ఞాని, తత్త్వవేత్త మరొకడు లేడు. నా శరీరంలోకి రాబోయే రోగాల్ని, మనసులోకి రాబోయే ఆలోచనల్ని వాడు దూరం నుంచే పోల్చెయ్య గలడు. వాడొక సారి అన్నాడు కదా—

"ఒరే, శేషూ! మీ వాళ్ళు నీకు దూరంగా ఇంకా ఎంతకాలం ఉండ గలర్రా?"

అప్పుడు మేమిద్దరం వెన్నెల్లో కూచుని కబుర్లు చెప్పు కుంటున్నాం. వెన్నెల నులివెచ్చగా కురుస్తోంది. పెరట్లో ఉన్న కొబ్బరిచెట్లు వెన్నెల్లో స్నానం చేస్తూ మాలాగే మత్తుగా ఉన్నాయి. కొబ్బరాకుల మీద నుంచి వెన్నెల తెల్లతెల్లగా, పచ్చ పచ్చగా జారు తూంది. అవి కత్తుల్లా తళ తళ మంటు న్నాయి. పాముల్లా పరపర మంటు న్నాయి.

"ఎప్పటికీ రారేమో!" అన్నాను.

"ఎందుకూ?" అన్నాడు వాడు.

"నేనంటే ఇష్టంలేదుగా!"

"ఈ ప్రపంచంలో బంధుత్వాలు ఇష్టానిష్టాల మీద మాత్రమే ఆధార పడవోయ్" అన్నాడు వాడు తత్త్వ వేత్తలా.

"నాకు బంధువులు మాత్రం ఎందరు ఉన్నారోయ్! మా అన్నయ్య, అక్కయ్య, మా పెద్దమ్మ అంతేగా?"

"బంధువులు నల్లుల్లా ముగ్గురు ఉన్నా చాలు" అన్నాడు వాడు నవ్వుతూ. వాడు మామూలుగా నవ్వి తేనే బాగుంటాడు. వెన్నెల్లో నవ్వితే ఆ నవ్వుకు పోలికల్లేవు.

నవ్వుల విషయం ఎలా ఉన్నా, నల్లుల విషయం కొంతకాలం మరిచి పోయాం...

ఒకసారి బాత్ రూమ్లో పడి పోయాను. కారణం తెలీదు. అప్పుడు నేను ఇప్పట్లా కాకుండా మామూలుగానే ఉన్నాను. ఉన్నట్లుండి తల తిరిగింది. పడిపోతున్నా ననిపించింది. పడి పోయే ఉంటాను. లేకపోతే తెలివి వచ్చేసరికి అస్పత్రిలో ఎందుకుంటాను? ఈ వైపు వేణు, ఆవైపు ఆదిలక్ష్మి చెరో చెయ్యీ పట్టుకుని కూచుని ఉన్నారు...

నిజం చెప్పద్దూ నా కా వాతావరణం చూస్తే నవ్వొచ్చింది. కానీ నవ్వలేక పోయాను. నవ్వు వచ్చినప్పుడు నవ్వలేక పోతే నాకు చాలా కోపం వచ్చేస్తుంది. ఇంతకూ ఎందుకు నవ్వు వచ్చిం దంటారా? నేను అస్పత్రిలో పడుకొని ఉండటం ఎందుకో నాకు అసహజ మనిపించింది. నేను అస్పత్రిలో పుట్టనూ లేదు. నాకు బుద్ధి తెలిశాక వెళ్ళనూ లేదు...

డాక్టర్ వేణు ఏవేవో పరీక్షలు చేయించాడు. ఉప్పూ, కారం తినకూడ దన్నాడు. అన్నట్టు తాగకూడదని కూడా అన్నాడు. కనీసం కొంత కాల మైనా గోతేసు బుద్ధుడిలా ఉండా లన్నాడు.

"ఎందుకురా?" అని నేను అడగ లేదు.


"ఇందుకురా?" అని వాడు చెప్పలేదు. వాడి సంతృప్తి కోసం తల వూపాను.

"ఏమిట్రా నీ కింత జబ్బు చేసినా మీ వాళ్ళెవరూ రాలేదూ?" అన్నాడు వేణు ఒక రోజు సాయంకాలం అస్పత్రి వరండాలో కూచుని మాట్లాడుతూ. చీకటి పలచ పలచగా ఉంది. రోగుల్ని చూడటానికి వచ్చిన బంధువులతో అస్పత్రి గలగల లాడుతూ ఉంది. ఆదిలక్ష్మి మాటల్లో చెప్పాలంటే పేరం టంలా ఉంది. వీరి మధ్య నర్సుల యూనీఫారాలు గరగరలాడు తున్నాయి. నన్ను కాదని సిగరెట్టు కాలుస్తూ కూర్చున్న వాడి మీద నా కెందుకో కోపం చిర చిర లాడింది.

"నేను చచ్చినా వాళ్ళు రార్రా" అన్నాను ఆ విసుగులో.

అప్పుడువాడు అనోరకంగా"అహా" అన్నాడండి. అప్పుడు ఆ మసక చీకట్లో వాడి కళ్ళు చిత్రంగా మెరిశాయండి. వాడు 'అహా' అన్నాడంటే కొంప మునిగిందన్న మాటే. ఏదో చదరంగం ఎత్తు వేసినప్పుడో, ఎక్కడో టైమ్ బాంబు పెట్టినప్పుడో తప్ప"అహా" అని వాడు అలా అనడండి.

వాడు ఉండమనే దాకా అస్పత్రిలో ఉండి, పది రోజుల తరువాత ఇంటికి తిరిగి వచ్చాం.




అస్పత్రి నుంచి తిరిగి వచ్చిన రోజు రాత్రి దాదాపు ఎనిమిది గంటలప్పుడు ఆదిలక్ష్మి కోసం ఎదురు చూస్తూ కుర్చీలో పడుకొని ఉన్నాను. అలసట వల్ల కాబోలు, నిద్ర ముంచుకు వస్తూంది. ఆకలి కూడా దంచేస్తూంది. ఒక వేళ నేను చచ్చి పోయింటే ఆదిలక్ష్మి గతి ఏమయ్యేదనిపించింది. ఆ ఆలోచ నకు భయమేసి దగ్గరి కొస్తున్న నిద్ర కోసం వచ్చిన ఆడవానిలా దూరంగా పారి పోయింది.

నిద్ర పారి పోయింది కానీ, సందేహం మాత్రం తీరలేదు. ఉదయాన్నే ఈ విషయం గురించి వేణుతో ఆలోచించా లనుకుంటుండగా తక్కుతూ, తారుతూ రారానిచోటికి వచ్చినట్లుగా లోపలికి వచ్చాడు మామయ్య మహాశయుడు.

"ఏమిటి, మామా! దారి తప్పి నీతి లేని వాడింటికి వచ్చేశావు" అన్నాను.

"అదేమిట్రా అలా అంటావు! మన మేమైనా శత్రువులమా? నువ్వు ఎంత కాదన్నా నా అక్క కొడుకు కాకుండా పోతావా?.. " అంటూ ఉపన్యాసం ప్రారంభించాడు.

"నన్ను చూట్టానికి వచ్చావా, మామయ్యా?" అన్నాను చిలిపిగా.

"మరెందు కనుకున్నావు? నీ ఆరోగ్యం సంగతి ఉదయమే తెలిసింది. పరుగెత్తి రావాలనుకున్నాను. కానీ ఉద్యోగం ఒకటి ఏడ్చింది కదా? ఆల స్యమైపోయింది. అన్నట్టు మరో శుభ వార్తరా! ఏమిటో నిన్ను చూచే

నరికి అన్నీ మరిచిపోతున్నాను" అని మరిచి పోవటానికి ప్రయత్నించాడు.

"ఏమిటి? శుభం నీకా నాకా?" అన్నారు.

"ఇద్దరికీ. ఇందిర పెళ్ళి నిశ్చయమై పోయింది. పెళ్ళి జరిపించే భారం నీదే" అన్నాడు మామయ్య, ఉచ్చు వేశాను, ఎలా తప్పించుకుంటావో చూద్దాం అన్నట్లుగా.

"ఇందిర ఎవరూ?" అన్నాను.

"నీ ఇల్లు బంగారం కానూ నా పెద్ద కూతుర్రా."

"నా ఇల్లు బంగారమైనప్పుడు తప్పకుండా రా. మరిచి పోవద్దు. మాట తప్పకుండా పది ఇటుకలు ఇస్తాను" అన్నాను.

ఇంతలో ఆదిలక్ష్మి భోజనం కారియర్‌తో లోపలికి వచ్చింది. క్షణం పాటు మామయ్యను చూచి, టేబిల్ వద్దకు వెళ్ళి కారియర్ విప్పటం ప్రారంభించింది. ఆదిలక్ష్మి లాంటిదే ఆదిలక్ష్మి వంట కూడా. కనిపించాక తల తిరిగి పోతుంది.

"భోంచేద్దాం రా, మామయ్యా?" అన్నాను.

"ఈ మైలకూడు తినవలసిన ఖర్మ నాకు లేదు" అన్నాడు.

'హో...అలాగా! డబ్బుకు మైల లేదా ఏమిటి?" అన్నాను.

ఆదిలక్ష్మిని, నన్ను కత్తులు విసిరినట్టుగా చూచి, పోషన్ మరిచి పోయిన నటుడిలా నిష్క్రమించాడు మామయ్య.

మామయ్య ఎందుకు వచ్చాడని ఆదిలక్ష్మి అడగలేదు, నేను చెప్పలేదు. మామయ్య వెళ్ళి పోతుండగా ఆదిలక్ష్మి కళ్ళలో తళుక్కుమన్న వెలుగు ఆవిడ అడగని ప్రశ్నకు నేను చెప్పని జవాబు.

మరుసటి రోజే రెండో ఆశ్చర్యం ఎదురైంది.

ఆ రోజు ఇంకా గూట్లో పొద్దు ఇంకా గూట్లో ఉండగానే తలుపు తట్టిన శబ్దం వినిపించింది. లేచి చూస్తే ఆదిలక్ష్మి కనిపించలేదు. వంటింట్లో నుంచి కాఫీ డికాక్షన్ వాసన దూసుకుని వచ్చింది.

విసుక్కుంటూ వెళ్ళి తలుపు తీస్తే అక్కయ్య నిలబడి ఉంది.

"నువ్వటే"! అన్నాను ఆశ్చర్య పోతూ.

తలుపు తోసుకుని లోపలికి వచ్చి, "ఎలా ఉన్నావురా, గిరీ!" అంటూ నా ఒళ్ళంతా తడుముతూ కన్నీరుకార్చేయ సాగింది.

"నాకేం— లక్షణంగా ఉన్నాను" అన్నాను.

"నువ్వు అలా అంటున్నావంటే మాకు దూరమై లోపల్లోపల నువ్వెంత కుమిలి పోతున్నావో నాకు తెలీదను కున్నావా?" అంది కళ్ళు నలుపుతూ.

"ఆ మాట నీతో ఎప్పుడైనా చెప్పానా?" అన్నాను.

"నువ్వు చెప్పాలేమిటి? మనసుకు మనసే సాక్ష్యం. మనం తెంచుకుందా మన్నా రక్త సంబంధాలు తెగవురా?"

అక్కయ్యకు కన్నీళ్ళు పిలవగానే ఎంత త్వరగా పలుకుతాయో ఆలోచిస్తూ కూర్చున్నాను.

"నువ్వు నాకు అల్లుడు కావాల్సిన తమ్ముడివి. అది—ఆ రాక్షసి — నిన్ను మాకు దూరం చేసింది" అంది మళ్ళీ చుట్టూరా చూస్తూ.

"ఎవరు? ఆదిలక్ష్మినా?"

"అదే—అయిందేదో అయిపోయింది. ఇప్పుడైనా మించిపోయింది లేదు. హాయిగా శశిని పెళ్ళి చేసుకోరా" అంది చిరునవ్వు ముఖం పెట్టి. నాకు కోపంతో గుండె ఆగిపోయినంత పనైంది.

"నా వయస్సెంతనుకున్నావ్?" అంటూ లేచి నిలబడ్డాను.

"ఎంతైతేనేం? నలభై రెండు. అది మాత్రమేం పదారేళ్ళ బాలాకుమారా? దానికీ వచ్చాయిగా ముప్ఫై ఏళ్ళు."

ఈ రెండూ అబద్ధాలే. నాకు ఏం చేయాలో అర్థం కాలేదు. అవిడను బలవంతంగా బయటికి తోసి తలుపు వేస్తే తప్ప లాభం లేదు. కానీ ఆ పని చేయటానికి తటపటాయిస్తున్నాను.

ఇంతలో ఆదిలక్ష్మి రెండు గ్లాసుల కాఫీ తీసుకొని హాల్లో కొచ్చింది. మా ఇద్దరి మధ్య నిలబడి ఒక గ్లాసు అక్కయ్యకు అందిస్తూ "తీసుకోండి" అంది.

అయ్యా! అప్పుడు మా అక్కయ్య అన్న మాటలు అన్నీ ఇన్నీ కావు. అరచి అరచి అలిసిపోయి, ఆమె వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళిపోయాక చూసుకుంటే మా హాలు శాపాలతో నిండిపోయి ఉంది. వాటి మధ్యలో అలాగే కూలబడిపోయాను.

నిజం చెప్పొద్దూ! నేను ఒక రకమైన మృగాన్ని. ఉద్రేకాల మనిషిని— ఆలోచించటం, జుట్టు పీక్కోవటం నా తత్వానికి అసలు పడదు. కానీ ఆ రోజు ఆలోచించకుండా ఉండలేక పోయాను.

ఉన్నట్టుండి మిట్ట మధ్యాహ్నం చక్కగా వూడిపడ్డాడు అన్నయ్య— నేలకు తగులుతున్న కారియర్‌తో, సిగ్గు పడి పోతున్న ముఖంతో, మళ్ళీ మామూలు మాటలే. అనుబంధాల గొడవలు, రక్తం పంచుకోవటాలు. . . శివ పూజలోకి ఎలుగ్గొడ్డులా

అరగంట తరువాత అన్నయ్య వెళ్ళి పోయాడు కారియర్‌తో పాటు.

నా ఆలోచన తెగలేదు. దాదాపు ఇరవై సంవత్సరాల క్రితం నన్ను వీళ్ళంతా తిరస్కరించారు. తెలుగులో ఎన్ని తిట్లున్నాయో అన్నీ నామీద ప్రయోగించారు. చిట్ట చివరకు వాళ్ళ ఇళ్ళలో జరిగిన మంచి, చెడ్డ కార్యాలకు కూడా నన్ను పిలవలేదు. మొన్న జబ్బు చేసి ఆస్పత్రిలో పడి ఉంటే వీళ్ళకు నేను జ్ఞాపకం రాలేదు. ఆస్పత్రి నుంచి తిరిగి రాగానే ఒకే రోజు వీళ్ళకు నా మీద అభిమానం ఎందుకు పొంగుకు వస్తోంది?... ఏమో, నాకేం అర్థం కాలేదు. మాట్లాడవేళ్తనడుగుదామంటే వాడు కనిపించటంలేదు.

ఆ రోజు రాత్రి అన్నం వడ్డిస్తూ ఆదిలక్ష్మి అంది:

"సాయంకాలం శశి వచ్చింది."

"ఏమట?" అన్నాను కాస్త ఆశ్చర్య పోయి.

"ఏం లేదు. మిమ్మల్ని పెళ్ళి చేసుకోవటం దానికి ఇష్టంలేదట" అంది ఆదిలక్ష్మి నాజూగ్గా నవ్వుతూ.

"ఎంత అవమానం! ఎందుకట?" అన్నాను చిలిపిగా.

"తానో అబ్బాయిని ప్రేమించిందట."

"భేష్. . .ఎవరా అబ్బాయి?"

"అన్ని విషయాలూ మీతోనే చెబుతుందట. రమ్మంటారా?"

"సరే, రమ్మను" అన్నాను ఆలోచిస్తూ. . .

మరో నెల తిరిగింది.

జారి పోతుందేమోననుకున్న ఆరోగ్యం గట్టిగా చేతికి చిక్కింది. మళ్ళీ మును పటి ధైర్యం తిరిగి వచ్చింది. మా డాక్టరు కూడా నా మీద ఉంచిన నిబంధనల్ని సడలించాడు. చిరుచలి వచ్చింది తెల్లని వెన్నెలా వచ్చింది. ఆ రోజు నేనూ, వేణూ వెన్నెల్లో కూచుని కొన్ని నియమాలు ముందే అనుకుని, ఎంతో కాలంగా మానేసిన కార్యక్రమాన్ని ప్రారంభించాము. మా వాడికి కాస్త నాలుక చేదైతే ఉర్దూ కవిత్వం జ్ఞాపకం వస్తుంది. అలాంటప్పుడు వాడు చెప్పటం, నేను వినటం.

మామూలుగానూ—అంటే వాడు మాట్లాడటం ప్రారంభిస్తే ఎదుటి వారు అలా వింటూ కూచుంటారు వాడు ఇంగ్లీషులో, తెలుగులో అప్పుడప్పుడూ ఉర్దూలో వాయించే నాగస్వరం వింటూ.

అక్కయ్యా, అన్నయ్యా పరుగెత్తుకు వచ్చారు.

"ఒరే, గిరీ! శశి నిన్నటి నుంచీ కనిపించటం లేదురా" అంది ఏడవటానికి సిగ్గుపడిపోతూ.

అవునన్నట్టుగా నిలబడ్డాడు అన్నయ్య చాలా దూరంగా.

వేణు నాకు మాత్రం అర్థమయ్యేలా నవ్వాడు.

శశి ప్రేమించిన ఆదిలక్ష్మి మేనల్లుడు కూడా నిన్నటి నుంచీ కనిపించటం లేదని మా అక్కయ్యకు, అన్నయ్యకు తెలీదు.

"నిజంగానా?" అన్నాను ఆశ్చర్యం నటిస్తూ.

"నిజంగానేరా, గిరీ" అంది అక్కయ్య,

"అబ్బబ్బబ్బ! ఎంత నీతిలేని పని!" అన్నాను.

"ఏమిట్రా నీతిలేని పని. . ." అంటూ కోపంగా ముందుకు వచ్చాడు అన్నయ్య. అప్పుడు గోడవారగా ఉన్న టీపాయ్ అతనికళ్ళ పడింది. ఆశ్చర్యంతో అతని కళ్ళు, నోరు పెద్దవయ్యాయి.

"మళ్ళీ ప్రారంభించావురా, తాగుబోతు వెధవా! ఇలాగైతే ఆరు నెలల్లో పోవాల్సిన వాడివి రెండు నెలల్లోనే పోతావ్" అంటూ అరిచాడు.

"వానికి మరో పాతిక సంవత్సరాలు గ్యారంటీ రాసిస్తాను" అన్నాడు వేణు చిలిపిగా గ్లాసు పైకెత్తుతూ.

"ఆ... వాడికి కాన్సరువచ్చింది. ఆరు నెలల్లోగా పోతాడని చెప్పావు కదయ్యా" అన్నాడు అన్నయ్య కోపంతో వణికి పోతూ.

"తమాషాకి చెప్పాను" అన్నాడు మాతత్వవేత్త.

"ఛీఛీ! మీ ముఖం చూడకూడదు" అంటూ వెనుదిరిగాడు అన్నయ్య. క్షణం తటపటాయించి మా అక్కయ్య కూడా అనుసరించింది.

రెండు చేతుల్లోనూ రెండు ప్లేట్లతో అప్పుడే మేడమీదికి వచ్చిన ఆదిలక్ష్మి అలాగే నిలబడి పోయింది.

వేణు వెన్నెల సిగ్గు పడిపోయేలా నవ్వుతూ కూర్చున్నాడు.

ఆదిలక్ష్మి ముందుకు వచ్చి ఒక ప్లేటు వాడి ముందు, ఒక ప్లేటు నాముందు ఉంచి, "తీసుకోండి, అన్నయ్యా, మీరూ తీసుకోండి" అంది.

"అదిరా సంగతి," అన్నాడు వాడు ప్లేటు అందుకుంటూ.

నేను ఆస్పత్రిలో ఉండగా వాడు "అలాగా" అన్నందుకు అర్థం నా కిప్పుడు తెలిసి వచ్చింది. .

*